క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన



హెచ్ఐవీపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరం పాతబస్టాండులో ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాల ద్వారా ఎయిడ్స్/హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం కళాజాత బృందాలు అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీడీఎస్ సభ్యులు ఇందిర, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యం



నృత్యప్రదర్శనలో కళాకారులు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా బాలబాలికలు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కడప నగరంలోని వర్షిణి డాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు వెలు ప్రాచుర్యం పొందిన సినీగీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు ప్రదర్శించారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వసతి గృహం పరిశీలన

మైదుకూరు : మైదుకూరు బీసీ బాలుర వసతి గృహాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రచార కార్యదర్శి బద్వేల్ గురుమూర్తి, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రెడ్డి బాబు ఆదివారం పరిశీలించారు. విద్యార్థులకు క్రమశిక్షణ, నైతిక విలువలు, వ్యక్తిగత శుభ్రత ఆరోగ్య సూత్రాలను వివరించారు. వసతి, భోజన సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బేరీల శ్రీనివాసులు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం విభాగం జిల్లా అధ్యక్షుడు మణికుమార్ పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చి సందర్శన

కలసపాడు : స్థానిక సగిలేరు ఒడ్డున ఉన్న సీఎస్ఐ చర్చిని నంద్యాల జిల్లా బోడెండ్లపల్లెకు చెందిన భక్తులు ఆదివారం కాలినడకన వచ్చి సందర్శించారు. లెంట్ దినాలను పురస్కరించుకుని చర్చిలో సామూహిక ప్రార్థనలు చేశారు. చర్చి చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవ. సంజయ్ మధుబాబు, రెవ. ఆశిష్‌గాబ్రియేల్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

చాపాడు : స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలోని వైఎస్సార్ కళ్యాణ మండపంలో సోమవారం గ్రామ వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి మహబూబ్‌బీ తెలిపారు. మధ్యాహ్నం 2.30గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య పాల్గొని వాలంటీర్లను సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులతో సత్కరిస్తారన్నారు.

వైభవంగా పోతురాజు విగ్రహ ప్రతిష్ట



ప్రత్యేక అలంకరణలో పోతురాజు

రాజుపాళెం : మండలంలోని కొట్టాల గ్రామంలో ఆదివారం గ్రామ దేవత పెద్దమ్మ, పోతురాజు స్వాముల విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. వేడుకలకు వివిధ గ్రామాల నుంచి బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో రావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. విగ్రహ ప్రతిష్ట అనంతరం భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు అమరేశ్వరి, స్థానికులు పోచన రమేష్‌రెడ్డిని గ్రామస్తులు సన్మానించారు.

చిన్న శేష వాహనంపై వెంకటేశ్వరుడు

పులివెందుల టౌన్ : శ్రీవెంకటేశ్వరస్వామి చిన్న శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్టణంలోని శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు వరదరాజస్వామి ఆధ్వర్యంలో స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ఉత్సవ విగ్రహాలను శేష వాహనంపై ఉంచి బ్రహ్మోత్సవం నిర్వహించారు. ఈ గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని హంస వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు.

పట్టుదల ఉన్నత శిఖరానికి సోపానం



మాట్లాడుతున్న జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్ట్ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి

వల్లూరు : విద్యార్థులకు ఉన్నత లక్ష్యం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలలు ఉన్నత శిఖరాలకు సోపానాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వల్లూరులోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆదివారం సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. ప్రతి విద్యార్థి నేటి ఓటమిని రేపటి విజయానికి నాందిగా భావించి సమాజంలో ఎదురయ్యే సమస్యలను, అవమానాలను పాజిటివ్ దృక్పథంతో ఎదుర్కొని ఉన్నత లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. లక్ష్య సాధనకు కావాల్సిన వ్యక్తిత్వాన్ని, మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న పేదరికం, కష్టాలను గుర్తెరిగి ఉన్నత స్థానం కోసం ప్రయత్నాలు చేయాలన్నారు. విద్యార్థి పేదరికంలో పుట్టడం తప్పు కాదని, పేదరికంతో చనిపోవడం తప్పన్నారు. మన భవిష్యత్తు మన చేతిలో వుందని, ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానం అధిరోహించడానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. చదువుతో పాటు సంస్కారం, జ్ఞానంతోపాటు లోక జ్ఞానం, ఆధ్యాత్మిక భావాలు కలిగి వుండాలని దాని ద్వారా నైతిక విలువలు పెంపొందించుకుని ఆదర్శమైన భావితర పౌరులుగా ఎదగాలన్నారు. జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ అమ్మాయిలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి చదువు, సంస్కారం ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతి విద్యార్థిని చదువుకుని భవిష్యత్తులో మహిళా సాధికారత సాధించాలన్నారు. అనంతరం వంట శాలను, వంటకు ఉపయోగించే కూరగాయలు, ఇతర పదార్థాల నాణ్యతను పీవో పరిశీలించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు నజీమున్నీసా, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ట వేడుకలు



ప్రత్యేక అలంకరణలో శ్రీసీతారామ, లక్ష్మణ మూలవిరాట్



రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల : మండలంలోని పెర్నపాడు గ్రామంలో శ్రీరామాలయంలో విగ్రహ ప్రతిష్ట వేడుకలు అట్టహాసంగా ముగిశాయి. గ్రామంలో రూ.1.50 కోట్లతో నూతనంగా రామాలయాన్ని నిర్మించారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజల అనంతరం శ్రీసీతారాముల, లక్ష్మణ, అంజనేయస్వామి విగ్రహాలను కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ విగ్రహ ప్రతిష్టలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు.

సింహాద్రిపురం : మండలంలోని లోమడ గ్రామంలో సీతారామ, లక్ష్మణ విగ్రహ ప్రతిష్ట వేడుకలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల గ్రామోత్సవం ఘ నంగా నిర్వహించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఆదివారం రాయల్ రషీద్ అసోసియేషన్ వారు ముద్రించిన ట్రాఫిక్ నిబంధనల కరపత్రాలను యూటీఎఫ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది యువత డ్రైవింగ్‌పై అవగాహన లేకుండానే వాహనాలను అతివేగంగా నడుపుతూ.. చిన్న వయసులోనే ప్రమాదాలకు గురై తల్లిదండ్రులకు తీరని శోకాన్ని కలిగిస్తున్నారన్నారు. అతివేగంగా వాహనాలను నడపటం, వాహన సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం చేయరాదన్నారు. మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం లాంటి అలవాట్లను వదలిపెట్టాలన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, నాయకులు రాయల కరీముల్లా, వెంకటేశ్వరావు, ఏలేశ్వరావు, ఇరగప్ప, పవన్ కళ్యాణ్, చిన్నరాయుడు, బత్తల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వినతిని మన్నించండి.. బస్సును నడిపించండి

వీరబల్లి (రాయచోటి టౌన్) : తమ ఊరికి ఆర్టీసీ బస్సులు నడపాలని గడికోట గ్రామ ప్రజలు అభ్యర్థించారు. మండల పరిధిలోని గడికోటకు ఒక ప్రత్యేకత ఉంది. గడికోట వెల్లుల మిట్టకు బస్సు వెళ్లాలంటే మాండవ్య నదిని దాటుకొని వెళ్లాల్సిందే. వర్షాకాలంలో వాహనాల రాకపోకలు లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటారు. దీనిపై అధికారులకు, నాయకులకు గ్రామస్తులు అనేక సార్లు వినతిపత్రాలు సమర్పించారు. ఎవరూ పట్టించుకోలేదు. అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత కూడా వినతి పత్రాన్ని సమర్పించారు. దీనిపై విచారించి గత నెలలో రూ. 6 కోట్లు నిధులు కేటాయించి హైలెవల్ బిడ్జి నిర్మించేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు ప్రారంభించిన రోజు నుంచి గడికోట, వేల్పుల మిట్ట, రాచపల్లెతోపాటు ఇతర గ్రామాలకు ఆర్టీసీ బస్సు రావడం లేదు. బస్సు రాకపోవడంతో ఆ ప్రాంత నుంచి వీరబల్లె, రాయచోటికి రావాలన్నా, చాలా దూరం నడిచి రావాల్సి వస్తోందన్నారు. అలాగే విద్యార్థులకు పాఠశాలకు, కళాశాలలకు వెళ్లడానికి కూడా నాలుగైదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు తమ సమస్యపై స్పందించి తమ గ్రామానికి బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లి–కొత్తపేట సరిహద్దుల్లో వెలసిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో విందు భోజనాలను చేశారు. ఆలయ ఆవరణలోని సాయిబాబా, వైద్యనాథీశ్వరుడు, అక్కదేవతలు, నవగ్రహాలు, వీరభద్రుడు, ఆంజనేయస్వామిలకు పూజలు నిర్వహించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట

వీరపునాయునిపల్లి : మండలంలోని బుసిరెడ్డిపల్లెలో నేటినుంచి మూడు రోజుల పాటు సీతారామ, లక్ష్మణ సమేత నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడవ రోజు బుధవారం ఉదయం 9.45 గంటలకు యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, ధ్వజ కలశ ప్రతిష్ట, పూర్ణాహుతి తదుపరి సీతారాముల కల్యాణం తీర్థ ప్రసాద వినియోగం, రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో పెండ్లిమర్రి మండలం కొత్తగిరియపల్లె కోదండ రామయ్య కోలాట బృందంచే కోలాట కార్యక్రమంతో ప్రతిష్ట కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.

24 నుంచి కాశినాయన ఆరాధనోత్సవాలు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న శివునిపల్లె గ్రామానికి ఎదురుగా వెలసిన కాశిరెడ్డి నాయన 22వ ఆరాధనోత్సవాలు ఈనెల 24వ తేదీ నుంచి జరుగనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈనెల 24న స్వామికి పూజలతోపాటు అశ్వర్థ నారాయణ స్వామి కల్యాణం జరిపిస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 25న ఉదయం స్వామివారికి అభిషేకం, అలంకరణ, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను చేస్తామన్నారు. అనంతరం చెక్క భజన, కోలాటం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరుగుతాయన్నారు. అలాగే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు.

శ్రమదానం

పులివెందుల టౌన్ : పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అమల్‌రాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శంకరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థుల గ్రూప్ ఫొటో

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని 1979–80 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం కడపలోని ఓ హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. 44 ఏళ్ల తరువాత ఒకరికొకరు కలుసుకోవడంతో ఆత్మీయంగా పలకరించడంతోపాటు ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్య నేర్పించిన ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. ఇప్పటి నుంచి ప్రతి ఏడాది కలుసుకోవాలని వారు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ నాగరాజు, సామాజిక సేవల వెంకటరమణ, భవన నిర్మాత సతీష్ గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న దాతలు

సిద్దవటం : సంక్షేమ వసతి గృహాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పోతురాజు చారిటబుల్ ట్రస్టు వారు ఆదివారం పరీక్ష కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపకులు, పోతురాజు నారాయణమ్మ రెండవ వర్ధంతిని పురస్కరించుకొని సిద్దవటంలోని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గృహాల్లోని 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు అవసరమయ్యే వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు పుట్టపర్తి జిల్లా బుక్కపట్నం తహసీల్దారు భారతి, సుభాష్‌బాబు, పురుషోత్తం లోకేష్, నరసింహబాబు, సిరి, వెంకటేశ్వర ప్రసాద్‌లు మాట్లాడుతూ దళిత బహుజన విద్యార్థులు దాతలు అందించిన సహకారంతో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పోతురాజు కుటుంబ సభ్యులతోపాటు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి



శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందూ ధార్మిక వేత్తలు, రాజకీయ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : నేటి యువత ప్రస్తుత పరిస్థితుల్లో ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక గౌరవాధ్యక్షుడు అంజూరపు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కడపలో ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని హిందూ ధార్మిక వేత్తలు, ప్రజలు శోభాయాత్ర నిర్వహించారు. కడప బిల్టప్ సర్కిల్ సమీపంలోని అంభా భవానీ ఆలయ వద్ద నుంచి యాత్ర ప్రారంభమై నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఏటా ఫిబ్రవరి 19న నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఆదివారం ముందస్తు శోభాయాత్రను నిర్వహించామన్నారు. ఈ శోభాయాత్రలో భక్తులతోపాటు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ కడప ఇన్‌చార్జి మాధవిరెడ్డి, ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక చైర్మన్ రవిశంకర్‌రావు, చవన్, సురేష్, ట్రెజరర్ వీరేంద్ర రావు, సభ్యులు నాగార్జున, జగదీస్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీక బండలాగుడు పోటీలు

వేముల : గ్రామాల్లో నిర్వహించే బండలాగుడు పోటీలు గ్రామీణ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని ప్రముఖ వైద్యులు ఐసీ దినేష్‌రెడ్డి తెలిపారు. పెర్నపాడులో శ్రీరామాలయ విగ్రహ ప్రతిష్టను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఈ పోటీలలో నంద్యాల జిల్లాకు చెందిన దర్శవరం సుబ్బారెడ్డి ఎద్దులు 2505 అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ.1.50 లక్షలు, రమణారెడ్డి ఎద్దులు 2338 అడుగులు లాగి రెండవ బహుమతి కింద రూ.1.20 లక్షలు, గుంటూరు జిల్లాకు చెందిన త్రిషష్టరెడ్డి ఎద్దులు 2183 అడుగులు లాగి మూడవ బహుమతి కింద లక్ష రూపాయలు, అనంతపురం జిల్లాకు చెందిన రమేష్ ఎద్దులు 2100 అడుగులు లాగి నాల్గవ బహుమతి కింద రూ.80వేలు, గుంటూరుకు చెందిన త్రిషష్టరెడ్డి ఎద్దులు 1995 అడుగులు 5వ బహుమతి కింద రూ.70వేలు, కడపకు చెందిన శివరామిరెడ్డి ఎద్దులు 1849 అడుగులు లాగి 6వ బహుమతి కింద రూ.60వేలు, ప్రొద్దుటూరుకు చెందిన గురివిరెడ్డి ఎద్దులు 1800 అడుగులు లాగి 7వ బహుమతి కింద రూ.50వేలు, నంద్యాల జిల్లాకు చెందిన నాగయ్య ఎద్దులు 1662 అడుగులు లాగి 8వ బహుమతి కింద రూ.40వేలు, తాడిపత్రికి చెందిన రమేష్ ఎద్దులు 1653 అడుగులు లాగి 9వ బహుమతి కింద రూ.30వేలు, నంద్యాల జిల్లాకు చెందిన ఓబుళరెడ్డి ఎద్దులు 1644 అడుగులు లాగి 10వ బహుమతి కింద రూ.20వేలు, రంగోరిపల్లెకు చెందిన శివలోహిత్‌రెడ్డి ఎద్దులు 1000 అడుగులు లాగి 11వ బహుమతి కింద రూ.15వేల చొప్పున మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి బహుమతులను అందించారు. ఈ పోటీలలో 23 జతల ఎద్దులు పాల్గొనగా.. 11 జతల ఎద్దులకు బహుమతులు ఇవ్వగా.. మిగిలిన 12 జతల ఎద్దులకు కన్సలేషన్ బహుమతులను అందజేశారు.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యే లక్ష్యం



అధికారులు, సిబ్బందితో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న ధనుంజయరెడ్డి

ఓబులవారిపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నారని ముఖ్యమంత్రి సలహాదారు అర్.ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తల్లెంవారిపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేద ప్రజల పక్షపాతి అని, రాష్ట్రంలో నాడు – నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చి ఇంగ్లిష్ మీడియంలో కార్పొరేట్ స్థాయి విద్యను విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. తల్లెంవారిపల్లి గ్రామంలో దాదాపు రూ. 3 కోట్లతో నూతన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, నూతన భవనాలను నిర్మాణం ప్రారంభ దశకు చేరిందన్నారు. అనంతరం పాఠశాల తరగతి గదులలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు, ఎల్ఈడీ టీవీలను పరిశీలించారు. పరిసరాలను పరిశీలించి పాఠశాలకు ప్రయోజనం కలిగే విధంగా ప్రహరీ గోడ, తదితర అంశాలపై అధికారులకు సూచనలు, సలహాలను ఇచ్చారు. పాఠశాల వెనుకభాగంలో నిర్మిస్తున్న రక్షణ గోడను పరిశీలించారు. సమీపంలో దాదాపు రూ. 2 కోట్లతో నూతనంగా ఏర్పాటు చేస్తున్న 33కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పనులను పరిశీలించి పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ జయచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగినేని రమేష్ నాయుడు, చిన్నిరెడ్డి అశోక్ రెడ్డి, కె.ఉమాశంకర్ రెడ్డి, ఎంపీటీసీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శ్వాసపై ధ్యాసతో ఆత్మచైతన్యం

రాయచోటి టౌన్ : ఆత్మచైతన్యం కోసం శ్వాసపై ధ్యాస పెట్టాలని రాయచోటి పిరమిడ్ స్పిరుచువల్ సొసైటీ అధ్యక్షులు దేవకి సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిరంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి మార్చి 2 వరకు ఏడు రోజులు సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మిక ధ్యాన సప్తాహ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాయచోటి నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలకు చెందిన కుల, మత, లింగ భేదాలతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ప్రతి రోజు సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు నిర్వహించబడునని పేర్కొన్నారు. అనంతరం కో – ఆర్డినేటర్ డాక్టర్ బయారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆత్మపరిశీలన చేసుకొని మాంసాహారాన్ని తినడం మానివేసి శాకాహారం వైపు నడవాలని సూచించారు. మనం – మన ఆరోగ్యం అనే అంశాలపై గురువులు వచ్చి బోధిస్తారని చెప్పారు. 25 ధ్యాన రత్న అబ్దుల్ రహీం, 26న మేడసాని మోహన్, 27న హిమాలయ యోగి శ్రీ వేదానంద, 28న ధ్యాన గాన తుంబర పిప్పళ్ల ప్రసాద్ రావు, 29న గీతాయాదవ్, 01న భీమనేని వంశీకిరణ్ (సద్గురు స్పిరుచువల్ సొసైటీ వ్యవస్థాపకులు), 02న ప్రకృతి ఉమామహేష్‌లు ఆధ్యాత్మిక బోధనతోపాటు ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన ఆహార నియమాలు వాటి వలన లభించే లాభాలను బోధిస్తారన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి



నూతన కార్యవర్గ సభ్యులతో ఆపస్ నాయకులు

రాయచోటి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతన పీఆర్సీపై 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షులు నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఆపస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే రాయచోటి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నూతన సంఘంలో అధ్యక్షులుగా మల్లికార్జున, ప్రధాన కార్యదర్శిగా గడికోట బాలాజి, గౌరవాధ్యక్షులుగా రమేష్ కుమార్, కోశాధికారిగా రాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, వై.అంబికేశ్వరి, కార్యదర్శి ఓబుల్‌రెడ్డి, రాజ్యలక్ష్మిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయధ్యక్షులు రామాంజనేయరెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్ శైలజ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

నందలూరు(రాజంపేట) : మండలంలోని ఆడపూరు దిగువ హరిజనవాడలో జెడ్పీటీసీ గడికోట ఉషారాణి, వెంకటసుబ్బారెడ్డి దంపతులు పది లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని గడికోట ఉషారాణి, వెంకటసుబ్బారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నరసారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామచంద్రారెడ్డి, యానాదిరెడ్డి, రమణ, నరసింహులు, రమణయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.